తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
సోమవారం
30 జూన్ 2026
పేజీలు : 08
Follow :



## ధనార్జనే ధ్యేయంగా...
# ప్రైవేట్ స్కూల్స్
### అనుమతులు లేకుండా అడ్మిషన్లు, తరగతులు

- శ్రీ చైతన్య, వశిష్ఠ కో స్కూల్స్‌పై ఆరోపణలు
- లక్షల్లో ఫీజులు వసూలు, ఫిట్‌నెస్ లేని బస్సులు
- చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరిక




**మహేశ్వరం, జూన్ 30 (జనం సాక్షి):**
మహేశ్వరం నియోజకవర్గంలో ప్రైవేట్ స్కూల్స్ ధనార్జనే ధ్యేయంగా పనిచేస్తూ విద్యాశాఖ అనుమతులు లేకుండా అడ్మిషన్లు తీసుకుని తరగతులు నడుపుతున్నాయని విద్యార్థి సంఘాల నేతలు, తల్లిదండ్రులు తీవ్ర ఆరోపణలు చేశారు. మహేశ్వరం గేట్ సమీపంలో శ్రీ చైతన్య టెక్నో స్కూల్, వశిష్ఠ కో స్కూల్‌లు అనుమతులు లేకుండానే అడ్మిషన్లు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. మహేశ్వరం మండల కేంద్రంలోని శ్రీ చైతన్య స్కూల్‌కు పదవ తరగతికి అనుమతి లేదని విద్యార్థి సంఘాలు చెబుతున్నాయి. అనుమతులు లేని ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ తరగతులు నడుపుతున్నాయని, విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ స్కూల్స్‌కు సొంత బస్సులు లేకపోవడంతో ఇతర ప్రైవేట్ బస్సులు, ఫిట్‌నెస్ లేని వాహనాలను ఉపయోగిస్తున్నట్లు ఆరోపణలు వచ్చాయి. విద్యా హక్కు చట్టాన్ని తుంగలో తోసి విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

మహేశ్వరం ఎంఈఓ కాస్న నాయక్ మాట్లాడుతూ, ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న ప్రైవేట్ స్కూల్స్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. శ్రీ చైతన్య, వశిష్ఠ కో స్కూల్స్‌కు విద్యాశాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవని, అనుమతులు లేని స్కూల్స్‌లో పిల్లలను చేర్పించవద్దని తల్లిదండ్రులకు సూచించారు.





## పోలియో చుక్కల పంపిణీకి మంగళం!

- మూడు రోజుల కార్యక్రమాన్ని రెండు రోజులకే కుదించిన స్థానిక అధికారులు
- పైసల్లేవు చుక్కల మందు ఎలా వెయ్యాలి అంటున్న సిబ్బంది
- ఉదయం 11:30 అయినా ఆసుపత్రిలోనే తిష్ట..
- కొందుర్గు పిహెచ్‌సిలో మారని సిబ్బంది తీరు
- జిల్లా అధికారుల హెచ్చరికలతోనే కదిలిన వైనం




లోపలి పేజీలో

## నందివనపర్తిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తా

- గ్రామ అభివృద్ధికి పూర్తి సహకారం
- మట్టి రోడ్లు కనిపించవద్దు.. అదనపు నిధులిస్తా
- లైబ్రరీ పనుల్లో నిర్లక్ష్యం పై ఎమ్మెల్యే ఆగ్రహం
- రాజకీయాలకతీతంగా అభివృద్ధి చేద్దామని పిలుపు


నందివనపర్తి గ్రామంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ (టీపీఎస్) ఏర్పాటు చేయడం తన బాధ్యత అని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి స్పష్టం చేశారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి దీనిపై దృష్టి సారిస్తామని హామీ ఇచ్చారు.

- ఫీజుల మోత, పుస్తకాల దందా
- నిబంధనలకు తూట్లు పొడుస్తున్న ప్రైవేట్ స్కూల్స్
- చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం
- విద్యార్థి సంఘాలు తీవ్ర ఆగ్రహం



# పాఠశాలలు కాదు.. వ్యాపార కేంద్రాలు

## విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి

- కొత్త జీవోలను రద్దు చేయాలి
- పాత విధానంలోనే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలి
- తాండూర్ ఆర్డీవో కార్యాలయం ముట్టడించిన బీసీ సంఘం నాయకులు, విద్యార్థులు
- జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్



## నిమ్స్‌లో 16 మంది ఉద్యోగుల పదవీ విరమణ

- ఘనంగా సత్కరించిన డైరెక్టర్ ప్రొ.రాహుల్ దేవరాజ్
- అభివృద్ధిలో వారి పాత్ర ప్రశంసనీయమన్న డైరెక్టర్
- ఉద్యోగులు, బంధువుల సమక్షంలో ఘనంగా వీడ్కోలు



## విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలి



**తాండూరు జూన్ 30(జనంసాక్షి) :** విద్యార్థుల ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓ నంబర్లు 7, 8, 9ను వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ, బీసీ సంఘం తాండూర్ నియోజకవర్గ కన్వీనర్, జాతీయ బీసీ కార్యవర్గ సభ్యులు కందుకూరి రాజ్‌కుమార్ నేతృత్వంలో సోమవారం తాండూర్ ఆర్డీవో కార్యాలయాన్ని బీసీ సంఘం నాయకులు ముట్టడించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ, 2008లో ఆర్. కృష్ణయ్య చేపట్టిన ఉద్యమాల ఫలితంగానే ఫీజ్ రీయింబర్స్‌మెంట్ పథకం అమల్లోకి వచ్చిందని, ఈ పథకం ద్వారా లక్షలాది మంది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులు ఉన్నత విద్యను పూర్తి చేసి ఉద్యోగాల్లో స్థిరపడ్డారని అన్నారు. అయితే 2021 నుంచి ఫీజ్ రీయింబర్స్‌మెంట్ బకాయిలు సకాలంలో విడుదల కాకపోవడంతో కాలేజీ యాజమాన్యాలు విద్యార్థులపై ఫీజుల కోసం ఒత్తిడి పెంచుతున్నాయని, దీంతో అనేక మంది విద్యార్థులు చదువులు మధ్యలోనే మానేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

ప్రభుత్వం తీసుకొచ్చిన జీఓలు 7, 8, 9 ప్రకారం విద్యార్థులే ఫీజులు చెల్లించి, తర్వాత డీబీటీ ద్వారా డబ్బులు పొందాలనే విధానం పేద విద్యార్థులకు భారమవుతుందని, కాలేజీలకూ ఇబ్బందులు కలిగిస్తుందని అన్నారు. ఈ జీవోలను వెంటనే రద్దు చేసి, పాత విధానంలోనే నేరుగా కాలేజీలకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్ నిధులు విడుదల చేయాలని రాజ్ కుమార్ డిమాండ్ చేశారు. లేకపోతే ఆర్. కృష్ణయ్య నేతృత్వంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను ఉధృతం చేసి, అవసరమైతే తాండూర్ నుంచి వేలాది మంది విద్యార్థులతో అసెంబ్లీ, ప్రజాభవన్ ముట్టడి కార్యక్రమాలు చేపడతామని రాజ్‌కుమార్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు సయ్యద్ షకుర్, జిల్లా నాయకులు గడ్డం వెంకటేష్, మహిళా ప్రతినిధులు అనిత, నరసమ్మ, మంజుల, జగదీశ్వరి, వీరమణి, మీడియా ఇన్‌చార్జ్ బసవరాజ్, మండల అధ్యక్షులు నరేందర్, బసంత్, బీసీ విద్యార్థి నాయకురాలు మంజుల, యువ నాయకులు జోసఫ్, రాము ముదిరాజ్, బంగారు నవీన్, మంతన్ గౌడ్ అశోక్, టైలర్ రమేష్, బీటీ సురేష్, పోచయ్య, చిన్న, వివిధ కళాశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు, బీసీ సంఘం నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాలలు కాదు.. వ్యాపార కేంద్రాలు

**రంగారెడ్డి జిల్లా ప్రతినిధి, జూన్ 30 (జనం సాక్షి):** ప్రైవేట్ పాఠశాలలు విద్యాసేవ కంటే ధనార్జననే ధ్యేయంగా మారాయని, ఫీజుల మోత మరియు పుస్తకాల దందా జోరుగా కొనసాగుతున్నాయని విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆరోపణలు చేశారు. అధికార యంత్రాంగం మాత్రం కనీసం కన్నెత్తి చూడడం లేదని విమర్శించారు.

రంగారెడ్డి జిల్లాలో పుట్టగొడుగుల్లా వెలుస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ స్కూల్స్ నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పుస్తకాల అమ్మకాలు పాఠశాలలో నిబంధనలకు విరుద్ధమని తెలిసినా, స్కూల్ యాజమాన్యాలు కిలోమీటర్ల దూరంలో ప్రైవేట్ కేంద్రాలు, ఇండ్లలో పుస్తకాల దందా కొనసాగిస్తున్నాయని విద్యార్థి సంఘాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి.

ప్రైవేట్ స్కూల్స్ లక్షల రూపాయల ఫీజులు వసూలు చేసి పేద, మధ్యతరగతి ప్రజలపై భారం మోపుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. శ్రీ చైతన్య, నారాయణ, టెక్నో స్కూల్స్ వంటి ప్రముఖ సంస్థలు కూడా ఇష్టానుసారం వ్యవహరిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని, పుస్తకాల దందాను అరికట్టాలని విద్యార్థి సంఘాలు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాయి. అధికారులు చర్యలు తీసుకోకపోతే తమ ఉద్యమం మరింత తీవ్రం చేస్తామని విద్యార్థి సంఘాల నాయకులు హెచ్చరించారు. ప్రభుత్వం ప్రైవేట్ స్కూల్స్‌పై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విద్యను వ్యాపారం చేయడాన్ని అరికట్టాలని సంబంధిత వర్గాలు కోరుతున్నాయి.

## నిమ్స్‌లో 16 మంది ఉద్యోగుల పదవీ విరమణ



**ఖైరతాబాద్, జూన్ 30 (జనం సాక్షి):** నిమ్స్ ఆసు పత్రిలో వివిధ విభాగాల్లో సేవలందించిన ఉద్యోగు లు మంగళవారం పదవీ విరమణ పొందారు. కార్యక్రమంలో ఆసుపత్రి డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్, డీన్ ప్రొఫెసర్ పి. చంద్రశేఖర్, ఎగ్జిక్యూ టివ్ రిజిస్ట్రార్ పరంజ్యోతి కలిసి పదవీ విరమణ పొందిన ఉద్యోగులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ ప్రొఫెసర్ రాహుల్ దేవరాజ్ మాట్లాడుతూ.. పదవీ విరమణ పొందిన ఉద్యోగులు తమ సేవా కాలంలో ఆసుపత్రి అభివృద్ధికి విశేష కృషి చేశారని కొనియాడారు. వారి సేవలు సంస్థ కు చిరస్మరణీయమని పేర్కొన్నారు. పదవీ విరమ ణ పొందిన వారిలో డా.సుధారాణి ఎం.ఎస్.ఆర్ (సీనియర్ మెడికల్ ఆఫీసర్), టి.సుధా(లెక్చరర్), కరణం మోహన్(డిప్యూటీ రిజిస్ట్రార్, ఇన్‌చార్జ్ ఫైనాన్షియల్ కంట్రోలర్), మల్లికార్జునరావు కొనేరు (బయోమెడికల్ ఇంజనీర్),పారిజాతం సురేపల్లి, లక్ష్మీ దేవమ్మ మేక, కె.శాంతమ్మ, వెంకమ్మ కోటి (నర్సింగ్ ఆఫీసర్లు),ఎడా చరిత(సీనియర్ ఏఎన్ ఎమ్), ఈ. రాధాదేవి(టెక్నికల్ ఆఫీసర్), శ్రీనివాస రావు వలిచెర్ల(ల్యాబ్ టెక్నీషియన్ గ్రేడ్-1), జయ రాం రెడ్డి కోటు, ఆర్. సుకన్య(డీపీఏ గ్రేడ్-బి), కె. సాంబన్న శాస్త్రి(ఆఫీస్ సూపరింటెండెంట్), షమీమ్ బేగం (సెక్రటేరియల్ అసిస్టెంట్), బీ.పాషా (క్లాస్-4) ఉన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ దయాకర్, మీడియా రిలేషన్స్ ఆఫీసర్ సత్యగౌడ్, అలైడ్ సైన్స్ కాలేజ్ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, హెచ్ఆ ర్‌డీ సిబ్బంది ఏ.ఎన్.జ్యోతి శైలజ, డా.మార్త రమేష్, రాధిక, మహేష్‌బాబు, శాంతి, చీఫ్ నర్సింగ్ ఆఫీసర్లు పద్మావతి, తేజ, వినోదలక్ష్మి, వివిధ ఉద్యోగ సంఘాల నాయకులు, ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొని పదవీ విరమణ పొందిన వారిని అభినందించారు.

## రిటైర్డ్ ఉద్యోగులకు సైబరాబాద్ సిపి కార్యాలయంలో ఘన వీడ్కోలు



**శేరిలింగంపల్లి, జూన్ 30 (జనంసాక్షి) :** సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికి మంగళవారం ఘన వీడ్కోలు లభించాయి. సైబరాబాద్ సిపి కార్యాలయశీ ఆడిటోరియంలో 14 మంది పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బందికై పదవీ విరమణ కార్యక్రమాన్ని ఘనంగా ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో సిఐ సెల్‌లో సేవలందించిన ఎస్ఐ జాకీర్ హుస్సేన్, సిటిసి లో పనిచేసిన ఎస్ఐ వెంకట్ రెడ్డి, షాబాద్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్ఐ శంకర్ రెడ్డి, సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ నాగరాజు, పిసిఆర్ కు చెందిన ఎస్ఐ షేక్ షబుద్దీన్, రామచంద్రాపురం పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్ఐ నారాయణ గౌడ్, షీ టీమ్స్‌లో సేవలందించిన ఎస్ఐ శ్రీనివాస్, ఆమనగల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేసిన ఎస్ఐ సీతారాం రెడ్డి జూన్ 30తో పదవీ విరమణ పొందడం జరిగింది. వీరితోపాటు ఆమనగల్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ ఎస్. మురళీధర్, మాదాపూర్ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఏఎస్ఐ మాణిక్ రెడ్డి, సిఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ఎస్ఐ లు సుబ్బరాయుడు, మాణిక్ రెడ్డి, పిసిఆర్ సైబరాబాద్ లో సేవలందించిన పోలీస్ కానిస్టేబుల్ ఎ. లక్ష్మణ్ నాయక్, నార్సింగి పోలీస్ స్టేషన్‌కు చెందిన హోంగార్డు ఎం. నగేష్ ప్రభుత్వ నిబంధనల ప్రకారం మంగళవారం తమ ఉద్యోగ పదవీ విరమణ చేశారు. ఈ సందర్భంగా సైబరాబాద్ పోలీస్ బాస్ డాక్టర్ ఎం. రమేష్ మాట్లాడుతూ పదవీ విరమణ పొందుతున్న తన సహచర పోలీసు అధికారులు, సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పోలీస్ శాఖలో సుదీర్ఘ కాలం పాటు సేవలందించిన ప్రతి ఒక్కరికీ ఎన్నో అనుభవాలు, మధుర జ్ఞాపకాలు ఉంటాయని అన్నారు. జీవితంలో సగానికి పైగా కాలాన్ని పోలీస్ శాఖకు అంకితం చేస్తూ కుటుంబంకంటే విధులకే అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రజల భద్రతకోసం అహర్నిశలు కృషి చేశారని ఈ సందర్భంగా కొనియాడారు. పోలీస్ కుటుంబ సభ్యులుకూడా ఎంతో క్రమశిక్షణతో, సహనంతో పోలీసు ఉద్యోగుల సేవలకు అండగా నిలిచారని, వారి త్యాగం కూడా ప్రత్యేకంగా అభినందనీయమని సిపి రమేష్ పేర్కొన్నారు. పదవీ విరమణ పొందుతున్న అధికారులు, సిబ్బంది ఆయురారోగ్యాలతో, ఆనందంగా, కుటుంబ సభ్యులతో సుఖసంతోషాలతో విశ్రాంతి జీవితాన్ని గడపాలని ఆకాంక్షించారు. అలాగే, అవసరమైన సందర్భాల్లో పదవీ విరమణ పొందిన పోలీసు అధికారులు, సిబ్బంది తమ అనుభవాలను, సేవలను పోలీస్ శాఖతో పంచుకుంటూ శాఖ అభివృద్ధికి తోడ్పడాలని సూచించారు. అనంతరం పదవీ విరమణ పొందిన అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించి జ్ఞాపికలతో పాటు వారి పెన్షన్ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డిసిపి టి. అన్నపూర్ణ, ఎస్బి విభాగం డిసిపి సుధీంద్ర, క్రైమ్స్ డిసిపి ముత్యం రెడ్డి, సిఏఆర్ హెడ్ క్వార్టర్స్ డిసిపి సంజీవ్, ఏడిసిపి లు, ఏసిపి లు, ఇతర పోలీసు సిబ్బంది పాల్గొని పదవీ విరమణ పొందిన సహచరులకు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు.

## నందివనపర్తిలో తెలంగాణ పబ్లిక్ స్కూల్ ఏర్పాటు చేస్తా

**యాచారం మండలం, జూన్ 30 (జనం సాక్షి):**
నందివనపర్తి సర్పంచ్ రాయికంటి విజయ్ కుమార్, గ్రామస్థులు, యాచారం మండల నాయకులు తొర్రూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేను కలిసి వినతి పత్రం అందజేశారు. జిల్లా పరిషత్ పాఠశాలను టీపీఎస్‌గా మార్చాలని వారు కోరారు. వెంటనే స్పందించిన ఎమ్మెల్యే, ప్రస్తుత పాఠశాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. యాచారం మండలంలోని నంది వనపర్తిని అన్ని విధాలా అభివృద్ధి చేసి ఆరుట్ల మాదిరిగా టీపీఎస్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామంలోని ఇతర సమస్యలపై కూడా ఎమ్మెల్యే దృష్టి సారించారు. నందివనపర్తిలో మట్టి రోడ్లు కనిపించవద్దని అధికారులకు ఫోన్ ద్వారా కఠిన ఆదేశాలు జారీ చేశారు. అవసరమైతే అదనపు నిధులు కేటాయిస్తానని, పనులు వేగంగా పూర్తి చేయాలని సూచించారు. లైబ్రరీ నిర్మాణంలో నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తున్న అధికారులపై ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధికి అందరూ కలిసి పని చేద్దామని ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి పిలుపునిచ్చారు. తనను నమ్మిన గ్రామస్థుల కోసం నిలబడతానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే స్పందనపై నందివనపర్తి గ్రామస్థులు హర్షం వ్యక్తం చేసి ఆయనను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు, బి.యన్.రెడ్డి ట్రస్ట్ చైర్మన్ బిలకంటి శేఖర్ రెడ్డి, నాయకులు మూడేడ్ల వెంకటరెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పోలియో చుక్కల పంపిణీకి మంగళం!

**కొందుర్గు జనంసాక్షి:** దేశాన్ని పోలియో రహితంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కోట్ల రూపాయల బడ్జెట్‌తో ప్రతిష్టాత్మక 'పల్స్ పోలియో' కార్యక్రమాన్ని నిర్వహిస్తుంటే.. క్షేత్రస్థాయిలో మాత్రం అధికారుల నిర్లక్ష్యం ఈ ఆశయానికి తూట్లు పొడుస్తోంది. రంగారెడ్డి జిల్లా కొందుర్గు మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (ప్రాఎజ) పరిధిలో సాగుతున్న పల్స్ పోలియో కార్యక్రమం సిబ్బంది అలసత్వానికి, బాధ్యతారాహిత్యానికి పరాకాష్టగా నిలిచింది. భవిష్యత్తు తరాల ఆరోగ్యంతో ముడిపడిన ఈ బృహత్తర కార్యక్రమం ఇక్కడ వివాదాల సుడిగుండంలో చిక్కుకుంది.

భారత ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ (చీఎవీ) ద్వారా, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సమన్వయంతో ప్రతి ఐదేళ్లలోపు చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు అందించాలని కఠిన నిబంధనలు రూపొందించింది. షెడ్యూల్ ప్రకారం ఈ కార్యక్రమం 3 రోజులు జరగాలి. మొదటి రోజు పోలియో బూత్‌లలో, రెండు మరియు మూడో రోజుల్లో సిబ్బంది ప్రతి ఇంటికీ వెళ్లి సర్వే నిర్వహించి, ఐదు ఏళ్ళ లోపు చిన్నారులకు చుక్కలు వేయాలి. కానీ, కొందుర్గు పీహెచ్‌సీ పరిధిలో మాత్రం రెండు రోజులోనే అందరికి చుక్కలు వేసాం ఎవరైనా మిగిలిపోతే పి హెచ్ సి లో వేస్తాం డబ్బులు కూడా రావడం లేవు అంటూ ఓ బాధ్యతాయుతమైన అధికారిని బహిరంగంగానే ప్రకటన చేయడం ఇక్కడి దారుణ పరిస్థితికి అద్దం పడుతోంది.

పల్స్ పోలియో విధుల్లో పాల్గొనే ఆశా వర్కర్లు, ఏఎన్ఎంలు, వ్యాక్సినేటర్లకు రోజుకు కేవలం 75 రూపాయల చొప్పున అలవెన్స్ చెల్లించాల్సి ఉంటుంది. అయితే గతంలో చేసిన పోలియో విధులకు సంబంధించిన డబ్బులు కూడా ప్రభుత్వం నుంచి రాలేదని ఇక్కడి సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సమన్వయ లోపం, నిధుల విడుదలలో ఆలస్యం కారణంగా చిన్నారుల ఆరోగ్య హక్కు కాలరాయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పోలియో చుక్కల పంపిణీ రెండవ రోజున ఉదయమే ఇండ్ల సర్వే ప్రారంభించాల్సి ఉండగా, కొందుర్గు పీహెచ్‌సీ సిబ్బంది ఉదయం 11:30 గంటలవుతున్నా ఆసుపత్రి దాటి బయటకు రాలేదు. విధులను గాలికొదిలేసి ఆసుపత్రి ప్రాంగణంలోనే కాలక్షేపం చేశారు. దీనిపై స్థానిక ప్రజలు, సామాజిక నాయకులు తీవ్ర నిరసన వ్యక్తం చేస్తూ నేరుగా జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. జిల్లా అధికారులు స్పందించి, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించిన తర్వాతే సిబ్బంది మొక్కుబడిగా ఇండ్ల సర్వేకు కదలడం విశేషం.

భారత ప్రభుత్వం జాతీయ స్థాయిలో పోలియో రహిత సర్టిఫికేషన్‌ను నిలబెట్టుకోవడానికి తపిస్తుంటే, రాష్ట్ర ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పూర్తిగా వదిలేసిందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వాలు బడ్జెట్ విడుదల చేయకపోవడం ఎంత తప్పో.. దాన్ని సాకుగా చూపి అమాయక చిన్నారులకు పోలియో చుక్కలు వేయకుండా నిర్లక్ష్యం చేయడం అంతకంటే పెద్ద నేరమని మేధావులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ, రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖాధికారులు తక్షణమే స్పందించి, కొందుర్గు పీహెచ్‌సీ నిధుల నిలిపివేతపై స్పష్టత ఇవ్వాలని, విధులను బహిష్కరించే స్థాయికి తెచ్చిన స్థానిక అధికారులపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# ఓటరు ప్రత్యేక సవరణ ప్రక్రియను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి

**చిలుక మధుసూదన్ రెడ్డి**



**అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 30(జనం సాక్షి ):** ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా పునాది అని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరు ప్రత్యేక సవరణ ప్రక్రియను సద్వినియోగం చేసుకుని తమ ఓటు హక్కును పరిరక్షించుకోవాలని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలోని అనాజ్‌పూర్ గ్రామంలో కొనసాగుతున్న ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా బీఎల్‌ఓలు, బీఎల్‌ఏలతో మాట్లాడి సవరణ ప్రక్రియ పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి అర్హులైన ప్రతి ఓటరి వివరాలను నమోదు చేయాలని, ఎలాంటి అర్హుల పేరు కూడా ఓటరు జాబితా నుంచి మిస్ కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. అలాగే అనర్హుల పేర్లను నిబంధనల ప్రకారం తొలగించి, తప్పులు లేకుండా పారదర్శకంగా ప్రక్రియను పూర్తి చేయాలని ఆదేశించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి కుటుంబం తమ ఇంటికి వచ్చే బీఎల్‌ఓ లే,బీఎల్‌ఏలకు అవసరమైన వివరాలను అందించి సహకరించాలని కోరారు. ఎన్యూమరేషన్ ఫారాన్ని తప్పనిసరిగా రెండు కలర్ పాస్‌పోర్ట్ సైజ్ ఫోటోలతో సమర్పించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తమ ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏళ్ల బాల్‌రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ పాలెం శ్రీనివాస్ గౌడ్, వార్డు సభ్యులు గుజ్జ రాంరెడ్డి, కావలి వెంకటేష్ ముదిరాజ్, ఎరుకలి బాలకృష్ణ గౌడ్, ఇంజమూరి కవిత మహేందర్, గువ్వల భరత్ కుమార్, రాగని అరవింద్, నాయకులు కండెగాని మహేందర్, తాటిపల్లి శ్రీశైలం గౌడ్, ఏర్పుల శ్రీశైలం, పాలెం శివసాయి గౌడ్, ఏర్పుల ప్రవీణ్, శ్రీధర్, విఘ్నేష్‌తో పాటు బీఎల్‌ఓ అరుణ పాల్గొన్నారు.



# ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలి

**ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలి : జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**

**కొడంగల్ ,జూన్ 30 (జనం సాక్షి):** ఆసుపత్రిలో మౌలిక సదుపాయాల నిమిత్తం ప్రతిపాదనలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ దీపక్ తివారీ తెలిపారు.మంగళవారం కొడంగల్ మండలం అంగడి రాయిచూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని అందించేందుకు వైద్యాధికారులు చిత్తశుద్ధితో పనిచేయలన్నారు.ఆసుపత్రిలో కావలసిన మందులు ఎప్పుడూ అందుబాటులో ఉంచాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా ప్రసూతి , ఫార్మసీ, ఇన్ పేషెంట్ వార్డు, స్త్రీల వార్డు గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా గర్భవతుల, ప్రసవాల గురించి కలెక్టర్ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి ఎలాంటి అవసరం ఉన్న తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ అధికారులు తెలిపారు.అనంతరం గ్రామంలో ఎస్ఆర్ఐ ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ ప్రక్రియను జిల్లా కలెక్టర్ పరిశీలించారు. ఎన్యుమరేషన్ ఫారంలో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్త పడాలని కలెక్టర్ బిఎల్ఓ కు సూచించారు. ఓటరు జాబితాలో ఏవైనా మార్పులు ఉంటే సరి చేసుకునే విధంగా ప్రజలకు తెలియజేయాలని కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ తో పాటు కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ రాంబాబు, డీఎంహెచ్ఓ సుధాకర్ లాల్, పీహెచ్సీ డాక్టర్ బుష్రా ఫాతిమా, గ్రామ సర్పంచ్ సౌభాగ్య లక్ష్మి పాల్గొన్నారు.

# కొండాపూర్ కలాన్‌లో “హర్ ఘర్ జల్” కార్యక్రమం



**ధారూర్ జూన్ 30 (జనంసాక్షి) :** జల్ జీవన్ మిషన్ కార్యక్రమంలో భాగంగా ధారూర్ మండల పరిధిలోని కొండాపూర్ కలన్ గ్రామంలో మంగళవారం ఘర్ జల్ కార్యక్రమం నిర్వహించరు.ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజలకు నీటి అవసరం.నీటి సంరక్షణ ప్రాముఖ్యత.గ్రిడ్ ద్వారా వచ్చే త్రాగునీటి మూలం మరియు ప్రభుత్వం అందిస్తున్న శుద్ధి చేసిన త్రాగునీటి ప్రాముకృత వాటర్ క్వాలిటీ మానిటరింగ్ ల్యాబ్ సిబ్బంది. గ్రామసులకు త్రాగునీటి నాణ్యత గురించి వివరించి నీటి నమూనాలపై కొన్ని పరీక్షలను ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించి నీటిని సంరక్షించుకోవడం ప్రభుత్వం అందిస్తున్న శుద్ధి చేసిన త్రాగునీటిని జాగ్రత్తగా వినియోగించుకోవడం గురించి నినాదాలు చేశారు."హర్ ఘర్ జల్" గ్రామంగా ప్రకటించారు.జల్ జీవన్ గ్రామంలోని అన్ని ఇళ్లకు 100శాతం ట్యాప్ కనెక్షన్లు కల్పించబడ్డాయి."జల్ అర్పణ" కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఆర్డబ్ల్యూఎస్ శాఖ అధ్వర్యంలో గ్రామంలో నిర్మించిన ప్రభుత్వ ఆస్తులను గ్రామ పంచాయతీకి అధికారికంగా అప్పగించారు.ఈ పథకం కింద గ్రామంలో 1.97 కి.మీ పైప్‌లైన్ వేసి 163 గృహాలకు ట్యాప్ కనెక్షన్లు పూర్తి చేసి గ్రామానికి గ్రిడ్ ద్వారా త్రాగునీటి సరఫరా క్రమం తప్పకుండా కొనసాగిస్తున్నారు.కార్యక్రమం విజయవంతంలో సహకరించిన ఉద్యోగులు.సర్పంచ్.మరియు గ్రామ పంచాయతీ సభ్యులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ సర్పంచ్ వి.మాధవి. యాదయ్య. ఆర్డబ్ల్యూఎస్ డిఈఈ రత్న ప్రసాద్.ఆర్డబ్ల్యూఎస్ ఏఈ ఎం.రాఘవేంద్ర.ఆర్డబ్ల్యూఎస్ సిబ్బంది మరియు వాటర్ క్వాలిటీ మానిటరింగ్ ల్యాబ్ సిబ్బంది.గ్రామ కార్యదర్శి రుక్మిణి.గ్రామ ప్రజా ప్రతినిధులు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# బంట్వారంలో జులై 2న ఎస్సీ కార్పొరేషన్ దరఖాస్తుల పరిశీలన

**బంట్వారం జూన్ 30 (జనం సాక్షి) :** బంట్వారం మండల కేంద్రంలో ఎస్సీ కార్పొరేషన్ యాక్షన్ ప్లాన్ 2025 -26 కింద ఆన్లైన్లో దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల పత్రాల పరిశీలన జులై 2న ఉదయం 11 గంటలకు బంట్వారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో జరగనుంది. దరఖాస్తుదారులు ఆన్లైన్ ఫారమ్, ఒరిజినల్ ధ్రువపత్రాలతో తప్పనిసరిగా హాజరుకావాలని ఎంపీడీవో సూచించారు. గ్రామపంచాయతీల వారీగా జాబితాలో ఉన్న అభ్యర్థులు మాత్రమే ఈ పరిశీలనకు రావాలని ఆయన స్పష్టం చేశారు.

# టిజిఐఐసి సహకారంతో తాడిపర్తికి రూ. 6.65 కోట్ల నిధులు

**ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి చొరవతో సిసి రోడ్ల పనులు ప్రారంభం గత 30 ఏళ్లుగా జరగని అభివృద్ధి ఇప్పుడు సాకారం**



**యాచారం, జూన్ 30(జనం సాక్షి) :** కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తేనే గ్రామాల్లో నిజమైన అభివృద్ధి జరుగుతుందని యాచారం మండలం తాడిపర్తి గ్రామస్తులు నిరూపించారు. గత ముప్పై సంవత్సరాలుగా ఎలాంటి ప్రగతికి నోచకోక, అధ్వాన్నంగా మారిన తాడిపర్తి గ్రామం ఇప్పుడు సరికొత్త రూపురేఖలను సంతరించుకుంటోంది. ఇబ్రహీంపట్నం నియోజకవర్గ శాసనసభ్యులు మల్‌రెడ్డి రంగారెడ్డి ప్రత్యేక చొరవ, టి జి ఐఐసి సహకారంతో తాడిపర్తి గ్రామ సమగ్ర అభివృద్ధి కోసం ఏకంగా 6 కోట్ల 65 లక్షల రూపాయల భారీ నిధులు మంజూరయ్యాయి. ఈ నిధులతో గ్రామంలో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్ల పనులను గ్రామ సర్పంచ్ నీలం ఝాన్సీ రమేష్,శంకుస్థాపన చేసి ప్రారంభించారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న రోడ్ల సమస్యను ఇంత త్వరగా పరిష్కరించి, టి జి ఐఐసి సహకారంతో గ్రామానికి భారీగా నిధులు కేటాయించినందుకు తాడిపర్తి గ్రామ ప్రజలు స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి, సంస్థ యాజమాన్యానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. నిధుల మంజూరుతో గ్రామంలో పండుగ వాతావరణం నెలకొందని, రాబోయే రోజుల్లో తాడిపర్తిని ఒక మోడల్ గ్రామంగా తీర్చిదిద్దుతామని నాయకులు ధీమా వ్యక్తం చేశారు. ఉపసర్పంచ్ ముప్పిడి రమేష్,ఈ కార్యక్రమంలో ,కాంగ్రెస్ పార్టీ తాడిపర్తి గ్రామ శాఖ అధ్యక్షులు నీలం రాములు, మదర్ డెయిరీ డైరెక్టర్ మండలి జంగయ్య,వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# ర్యాష్ డ్రైవింగ్, ఆక్రమణలపై చర్యలు తీసుకోండి

**ట్రాఫిక్ సమస్యలపై డీఎస్పీకి బీజేపీ నేతల వినతి**

తాండూరు జూన్ 30 జనంసాక్షి : తాండూరు పట్టణంలో ట్రాఫిక్ సమస్యలను పరిష్కరించా లని కోరుతూ బీజేపీ నాయకులు మంగళవారం తాండూరు డివిజన్ డీఎస్పీ నర్సింగ్ యాదయ్యకి మెమోరాండం సమర్పించారు.బీజేపీ పట్టణ అధ్యక్షులు, బీజేపీ ఫ్లోర్ లీడర్, 28వ వార్డ్ కౌన్సిలర్ నాగారం మల్లేశం ఆధ్వర్యంలో నాయకులు డీఎస్పీని కలిశారు. పట్టణంలోని ట్రాఫిక్ సిగ్నల్స్ సక్రమంగా పనిచేసేలా చూడాలని, ట్రాఫిక్ సిబ్బందిని పెంచాలని వినతిపత్రంలో కోరారు.ర్యాష్ డ్రైవింగ్ చేసేవారిపై కఠిన చర్యలు తీసుకోవాలని, రోడ్లపై అక్రమంగా ఆక్రమణలు చేసిన వారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని డీఎస్పీకి వివరించారు.ఈ కార్యక్రమంలో 23వ వార్డు కౌన్సిలర్ అంతారం కిరణ్ కుమార్, 33వ వార్డు కౌన్సిలర్ శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ పట్టణ ఉపాధ్యక్షులు దోమ కృష్ణ, చిదిరి ప్రకాష్, ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ గౌడ్, చందు, చాకలి బిచ్చప్ప, బబ్లు, బస్వరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన మోమిన్ పేట బిఆర్ఎస్వి నాయకులు



**మోమిన్ పేట జూన్ 30 ( జనం సాక్షి)** మోమిన్ పేట భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం జిల్లా నాయకులు అల్ హజ్ అబ్దుల్ జుబేర్ నాయకత్వంలో మోమిన్ పేట మండలానికి చెందిన బి ఆర్ ఎస్ నాయకులు నగరంలోని బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ బలోపేతానికి యువత ముందుకు వచ్చి రాష్ట్రంలో ఉన్నటువంటి రాక్షస పాలన అంతం చేయడానికి కంకణం కట్టుకోవాలని ఆయన సూచించినట్లు తెలిసింది, ఆల్ హచ్ అబ్దుల్ జుబేర్ సల్మాన్ తో పాటు అక్రమ్, రఫీ, ముజ మిల్, అజాజ్ తదితరులు ఎమ్మెల్సీ పోచం పల్లి శ్రీనివాస్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు

# మౌలిక సదుపాయాల కల్పనకు కృషి

**సర్పంచ్ వి.సుజాత హనుమంత్ నాయక్**



**కేశంపేట జూన్ 30 (జనం సాక్షి)** : గ్రామంలో మౌలిక సదుపాయాలు కల్పించేందుకు గ్రామ పంచాయితీ పాలకవర్గంతో కలిసి తన వంతు కృషి చేస్తానని సర్పంచ్ వి. సుజాత హనుమంత్ నాయక్ అన్నారు. మండల పరిధిలోని దేవుని గుడి తండాలో సి సి రోడ్డు నిర్మాణ పనులకు సర్పంచ్ భూమి పూజ చేశారు. ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సహకారంతో ఎన్ఆర్ఈజీఎస్ 10 లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యేకు తండావాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు గూడ వీరేష్, ఉప సర్పంచ్ ఎ. రవి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వి. కిషన్ నాయక్, వార్డు సభ్యులు కె. శ్రీను, ఆర్. లక్ష్మి దశరద్, వి. దేవీ దాస్యా, వి. రుక్మన్, ఎస్. బుజ్జి జైరామ్, ఎ. శంకర్, ఎ. అంజమ్మ లక్ష్మణ్, నాయకులు సచిన్ పాల్గొన్నారు.

# సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ధారాదత్తం చేయొద్దు

- **సిఐటియు దుండిగల్ మండల కన్వీనర్ బొడిగే లింగస్వామి**



**నిజాంపేట్ జూన్ 30( జనం సాక్షి) :**
భవన నిర్మాణ సంక్షేమ బోర్డు పథకాలను ఇన్సూరెన్స్ కంపెనీలకు అప్పగించద్దని సిఐటియు దుండిగల్ గండిమైసమ్మ మండల కన్వీనర్ బొడిగె లింగస్వామి తెలిపారు. ఈ మేరకు మంగళవారం. భవన నిర్మాణ కార్మిక సంఘం సిఐటియు ఆధ్వర్యంలో దుండిగల్ మండల్ తాసిల్దార్ కు వినతి పత్రం అందజేశారు ఈ సందర్భంగా సిఐటియు జిల్లా నాయకులు మాట్లాడుతూ భవన నిర్మాణ సంక్షేమ బోర్డు స్కీములను ఇన్సూరెన్స్ కంపెనీలకు ఇవ్వొద్దని వెల్ఫేర్ బోర్డు నుండే సంక్షేమ పథకాలు కార్మికులకు అందించాలని తెలిపారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ .లింగస్వామి,. భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యులు .లింగం ప్రసాద్ భవన నిర్మాణ కార్మిక సంఘం మండల ప్రెసిడెంట్ ఎం రాజు మాట్లాడుతూ తెలంగాణ భవన మఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డు అమలు చేస్తున్న ప్రమాద మరణం .సహజ మరణం .శాశ్వత పాక్షిక అంగవైకల్యం ఈ మూడు స్కీములను ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీల ద్వారా అమలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం జీవో నెంబర్ 12 ను విడుదల చేసింది ఈ జీవో భవన నిర్మాణ కార్మికులకు చాలా నష్టం కావున తక్షణమే దీని ఉపసంహరించుకోవాలని కోరారు. ప్రైవేటు ఇన్సూరెన్స్ కంపెనీలకు వెల్ఫేర్ బోర్డులో ఉన్న డబ్బులను కోట్ల రూపాయలు దారిమళ్లెంచే ప్రయత్నం జరుగుతుందని తెలిపారు 1996 భవన నిర్మాణ కార్మికుల కేంద్ర చట్టం ప్రకారం వెల్ఫేర్ బోర్డు అడ్వైజరీ కమిటీని నియమించి వారి నిర్ణయం ప్రకారమే బోర్డు నిధులను ఖర్చు చేయాలని తెలిపారు ప్రభుత్వం కార్మిక శాఖ అధికారులు కమీషన్లకు కక్కుర్తి పడి ఎలాంటి గుర్తింపు లేని ఇన్సూరెన్స్ కంపెనీలకు స్కీములను అప్పగించి పేద నిర్మాణ కార్మికుల నోట్లో మట్టి కొడుతున్నారన్నారు. ఇప్పటికైనా
ప్రభుత్వం వెంటనే ఇన్సూరెన్స్ కంపెనీలను ఉపసంహరించుకోవాలని వెల్ఫేర్ బోర్డు ద్వారానే కార్మికులకు సంక్షేమ పథకాలు అందించాలని తెలిపారు కార్మికులందరికీ హెల్త్ కార్డులు ఇవ్వాలని కోరారు సహజ మరణానికి నష్టపరిహారం 2 లక్షల నుండి 5 లక్షలకు పెంచాలని వెల్ఫేర్ బోర్డు పెండింగ్ క్లెయిమ్స్ వెంటనే నిధులు విడుదల చేయాలని కోరారు 50 సంవత్సరాలు నిండిన భవన నిర్మాణ కార్మికులకు నెలకు 6000 పెన్షన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.
భవన నిర్మాణ కార్మికుల పిల్లలకు వారి చదువులకు స్కాలర్షిప్ లు గృహవసతి అడ్డాల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని తెలిపారు ఇండ్లు లేని భవన నిర్మాణ కార్మికులందరికీ ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని కోరారు ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు బి శ్రీనివాస్ .జి రామచందర్, అంజయ్య, .సందీప్ .సురేష్ తదితరులు పాల్గొన్నారు.



# మహిళా అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**రాజేంద్రనగర్,జూన్30(జనంసాక్షి) :** మహిళా సంక్షేమం, అభ్యున్నతికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ పేర్కొన్నారు. ప్రజా పాలన కార్యక్రమంలో భాగంగా నార్సింగ్ సర్కిల్-45 పరిధిలో నిర్వహించిన ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మహిళా సంఘాల సభ్యులు, మహిళలకు చీరలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ముఖ్యమంత్రి ప్రజా పాలనను అమలు చేస్తున్నారని తెలిపారు. అలాగే రాజేంద్రనగర్ నియోజకవర్గంలో మూసీ ప్రక్షాళనలో భాగంగా గండిపేట్ నుంచి బాబూఘాట్ వరకు తొలి దశ పనులు చేపట్టడం వల్ల ప్రజలకు ఎంతో మేలు జరుగుతుందని పేర్కొన్నారు.నార్సింగ్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, నార్సింగ్ పరిధిలోని అన్ని గ్రామాల్లో సుమారు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ ముదిరాజ్ కార్పొరేషన్ చైర్మన్ జ్ఞానేశ్వర్ ముదిరాజ్, నార్సింగ్, గుడిమల్కాపూర్ ఎఎంసి చైర్మన్లు కోట వేణు గౌడ్, తలారి మల్లేశ్ ముదిరాజ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ దశరథ్ యాదవ్, పీఓ స్వాతి రెడ్డి, యూసీడీఏఎంసీ లక్ష్మీకాంత్ రెడ్డి, మేప్మా ఇన్చార్జ్ రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం

కేశంపేట్, జూన్ 30 (జనం సాక్షి ) : ముఖ్యమంత్రి సహాయ నిధి అనారోగ్యం పాలై ప్రైవేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేదలకు వరమని సర్పంచ్ సి.భాస్కర్ గౌడ్ అన్నారు. మండల పరిధిలోని నిర్ధవెల్లి గ్రామానికి అనిసా కు మంజూరైన 50 వేల, కటికే నాగమణికి మంజూరైన 47 వేల రూపాయల విలువ గల ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను సర్పంచ్ అందజేశారు. అనంతరం లబ్ధిదారులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ సపూర అమేర్, వార్డు సభ్యులు నాగరాజు, చంద్రయ్య, రమేష్ నాయక్, చెన్నయ్య, రాము, రిజ్వానా బేగం , మంజుల, నాయకులు దిద్దెల జంగయ్య, ముత్యాలు, మల్లేష్, ఖాజాపాషా, షాబొద్దిన్, భాస్కర్, సిద్దాచారి, మజహర్ పాల్గొన్నారు.

## ఐఎండిబి మోస్ట్-అవైటెడ్ జాబితాలో 'రామాయణ పార్ట్ 1' అగ్రస్థానం

**ఖైరతాబాద్, జూన్ 30 (జనం సాక్షి) :** ప్రపంచ వ్యా ప్తంగా ప్రముఖ సినిమా డేటాబేస్ సంస్థ ఐఎండిబి విడుదల చేసిన 2026 ద్వితీయార్థంలో అత్యంత ఆసక్తిగా ఎదురుచూస్తున్న భారతీయ చిత్రాల జాబి తాలో రామాయణ పార్ట్ 1 తొలి స్థానంలో నిలిచిం దని ఐఎండిబి ప్రతినిధులు మంగళవారం నగరం లో విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. రెం డో స్థానంలో ఆల్ఫా, మూడో స్థానంలో టాక్సిక్ ఉ న్నాయని చెప్పారు. ప్రపంచ వ్యాప్తంగా నెలకు 250 మిలియన్లకు పైగా సందర్శకుల పేజీ వీక్షణల ఆధారంగా ఈ జాబితాను రూపొందించారని పేర్కొ న్నారు. ఈ జాబితాలో మొత్తం 20 చిత్రాలు ఉండ గా,12 హిందీ, 4 తమిళ, 2 మలయాళ, 1 తెలుగు (రణబాలి), 1 కన్నడ చిత్రం చోటు దక్కించుకున్నా యని తెలిపారు. నటుడు యష్ టాప్-3లోని రెం డు చిత్రాలు(రామాయణ పార్ట్ 1, టాక్సిక్)లో న టించడం విశేషం. అలాగే ఆల్ఫా, కింగ్ చిత్రాల్లో అనిల్ కపూర్, ధమాల్ 4, దృశ్యం 3 చిత్రాల్లో అజ య్ దేవగన్ నటిస్తున్నట్లు చెప్పారు. మీర్జాపూర్ ది మూవీ ప్రముఖ వెబ్ సిరీస్ ఆధారంగా రూపొందు తున్న తొలి చిత్రంగా గుర్తింపు పొందిందని తెలిపా రు.

# ప్రజల ఫిర్యాదులు ఎప్పటికప్పుడు అధికారులు పర్యవేక్షించాలి

- **సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి శ్రీజన ఐఏఎస్**



**నిజాంపేట్ జూన్ 30( జనం సాక్షి) :**
కుత్బుల్లాపూర్ నియోజకవర్గం సిఎంసి పరిధిలోని దుండిగల్ సర్కిల్ 59 లో గల వార్డు నెంబర్ 296లో మంగళవారం ( ఒక వార్డ్ ప్రతి రోజు) కార్యక్రమంలో భాగంగా సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ శ్రీ జన ఐఏఎస్ పర్యటించారు. ఈ పర్యటనలో స్థానిక సమస్యలను నేరుగా పరిశీలించి, అధికారులకు తగు ఆదేశాలు జారీ చేశారు. పర్యటనలో చర్చించిన ముఖ్య అంశాలు ప్రధానంగా కె.వి.ఆర్ కాలనీలో సి.సి రోడ్ల నిర్మాణం చేపట్టడం. నాగులూరు గ్రామానికి వెళ్లేందుకు నూతన రోడ్డు ఏర్పాటు, దుందుగల్ గ్రామంలో ఇంటి నంబర్ల జారీ పన్ను తగ్గింపు ప్రక్రియను వేగవంతం చేయడం. ఐ.ఎ.ఆర్.ఇ ( ఐఏఆర్ఇ ) కాలేజీ నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు వీధి దీపాల ఏర్పాటు.
శంభీపూర్ గ్రామంలో పారిశుధ్య పనుల మెరుగుదల. స్థానికంగా ఖాళీ స్థలాలలో పిల్లల కోసం ఆట వస్తువుల ఏర్పాటు. దుందుగల్ ఎస్.సి బస్తీలో సి.సి రోడ్డుకు ఎదురవుతున్న ఆక్రమణల సమస్యల పరిష్కారం. గాగిల్లాపూర్ సర్వే నెం. 214 లో స్మశానవాటిక కాంపౌండ్ వాల్ నిర్మాణం. దుందుగల్ గ్రామంలో అవసరమైన చోట కొత్త సి.సి రోడ్ల నిర్మాణం. వంటి సమస్యలు వంటి సమస్యలు దృష్టికి వచ్చాయని, ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎస్.ఎల్.ఏ నిబంధనలను ఖచ్చితంగా పాటిస్తూ, ప్రజల నుండి వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పు డు పర్యవేక్షించాలని ఆదేశించారు. ఇంటి నంబర్ల జారీ, పన్ను తగ్గింపు ఇంజనీరింగ్ పనులను నిర్ణీత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. ఖాళీ స్థలాల తనిఖీ వాటి అభివృద్ధి పనులను చేపట్టాలని తెలిపారు వర్షాకాలం నేపథ్యంలో ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మరియు ఏ.ఎల్.ఓ ప్రణాళికలను సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ , మేడ్చల్ మల్కాజిగిరి గ్రంథాలయ చైర్మన్ బి . శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ ఇంజనీర్ పాపమ్మ, ఎస్ డబ్ల్యూ ఎం, డిప్యూటీ ఇంజనీర్ అన్వేష్ రెడ్డి, ఏ.సి.పి శ్రీనివాస్, ఏ.ఎం.సి లక్ష్మయ్య, అసిస్టెంట్ ఇంజనీర్లు బి. సురేందర్ నాయక్, అశోక్ కుమార్, సంబంధిత సిబ్బంది పాల్గొన్నారు.

# సిపిఐ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్షవ్ పోస్టర్ల విడుదల.



**నిజాంపేట్ జూన్ 30( జనం సాక్షి) :**
కేంద్ర ప్రభుత్వం ద్వారా స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ చేపట్టే కార్యక్రమంలో భాగంగా ప్రజలకు మరింత అవగాహన పెరిగేందుకు మంగళవారం సిపిఐ ఆధ్వర్యంలో స్పెషల్ ఇంటెన్షవ్ రివిజన్ (సర్)కు సంబందించిన వాల్ పోస్టర్లు. నిజాంపేట్ లో మంగళవారం విడుదల చేశారు. .
అనంతరం సిపిఐ మండల కార్యదర్శి పాలభిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఇరవై సంవత్సరాలకు కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రోగ్రాం సర్ ను ప్రతి ఒక్కరు తమ విధిగా అవగాహన పెంచుకోవాలన్నారు. . కానీ కేంద్ర ప్రభుత్వంలో ఉన్న బీజేపీ పార్టీ ఓట్ల ఏరువేత పేరుతో ఓట్లను దొంగతనం చేస్తున్నది అని అన్నారు. అందుకే ప్రజలు అప్రమత్తంగా ఉండి ఓటు హక్కును కాపాడుకోవాలని వారు గుర్తు చేశారు. సర్ కార్యక్రమనికి సరైన ప్రచారం చేయటంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వైఫల్యం చెందుతున్నాయ న్నారు. వారు చాలా మందికి సర్ పైన సరైన అవగాహనా లేదు అని ఇంటింటికి వెళ్లి అప్లికేషన్ ఫారాలు పంచె బిఎల్ఓ ఫారాలు ఇచ్చి వెళ్తుచున్నారు తప్ప ప్రజలకు సరైన అవగాహనా చేయడం లేదని అన్నారు. ఇప్పటికైనా ప్రజలకు సరైన అవగాహనా కలిపించే బాధ్యత ప్రభుత్వల పై వుంది అని, పెద్ద ఎత్తున ప్రచారం చేయాలనీ వారు సూచించారు. ఈ కార్యక్రమంలో పొన్నకంటి దస్తగిరి, నర్సమ్మ, అమృత, నాగమణి, ముత్యాలు, సత్తమ్మ, లక్ష్మి, అమృత తదితరులు పాల్గొన్నారు.

# ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని ప్రక్రియను ఆకస్మికంగా తనిఖీ

- **ప్రతి ఒక్కరూ ఓటర్ గా నమోదు అయ్యేవిధంగా ప్రత్యేక చొరవచూపాలి**
- **జిల్లా కలెక్టర్ దీపక్ తివారి**



**కొడంగల్, జూన్ 30 (జనం సాక్షి):** కొడంగల్ మున్సిపల్ పరిధిలో గాంధీనగర్ కాలనీలోనీ మంగళవారం సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రం 238 పరిధిలో ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని ప్రక్రియను ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని ప్రక్రియను జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ఆకస్మికంగా తనిఖీ చేశారు. తనిఖీ చేశారు. ప్రతి ఒక్కరూ ఓటర్ గా నమోదు అయ్యేవిధంగా ప్రత్యేక చొరవచూపాలని కలెక్టర్ బిఎల్ఓ కు సూచించారు. ఎస్ఐఆర్ ప్రక్రియలో ఏమైనా మార్పులు చేర్పులు ఉంటే సరిచేసుకోవాలని ప్రజలకు సూచించారు. ఎన్యుమరేషన్ ఫారంలో సమాచారాన్ని పూరించడంలో ప్రజలకు సహకరించాలని కలెక్టర్ బిఎల్ఓ కు సూచించారు. కుటుంబ ఓటర్లు వేరే వేరే పోలింగ్ స్టేషన్లలో ఓటు కలిగి ఉన్నట్లయితే ఒకే పోలింగ్ కేంద్రానికి కుటుంబ సభ్యుల ఓట్లు ఉండే విధంగా క్రమబద్ధీకరించాలని అధికారులకు ఆయన సూచించా రు. వార్డులో జిల్లా కలెక్టర్ సందర్శించిన క్రమంలో ప్రజలు నీటి సమస్యపై కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చారు. నీటి సమస్యను పరిష్కరించేందుకు ప్రత్యామ్నాయం చూడాలని మున్సిపల్ కమిషనర్ కు కలెక్టర్ సూచించారు. అవసరం అనుకుంటే చేతి పంపుల(బోర్లు) ద్వారా నీటి సమస్యను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం నూతనంగా నిర్మిస్తున్న ప్రాథమిక పాఠశాల భవన పనులను కలెక్టర్ పరిశీలించారు. పాఠశాల భవనాన్ని అన్ని హంగులతో నెల రోజుల్లో అందుబాటులోకి తేవాలని కలెక్టర్ తెలిపా రు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని పంచాయతి రాజ్ డిఇ ని కలెక్టర్ ఆదేశించారు.కలెక్టర్ తో పాటు కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి, తహసిల్దార్ పి.రాంబాబు, ఎంపీడీవో ఉష శ్రీ, మున్సిపల్ చైర్మన్ నందారం ప్రశాంత్, కమిషనర్ బలరాం నాయక్, ప్రధాన ఉపాధ్యాయులు వెంకటయ్య, బిఎల్ఓ మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ సమస్యలపై కలెక్టర్‌కు వినతి పత్రం

**కొడంగల్, జూన్ 30 (జనం సాక్షి):** వికారాబాద్ జిల్లా కలెక్టర్ దీపక్ తివారి ,కడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి మంగళ వారం కొడంగల్ మండలం అంగడి రాయిచూర్ పర్యటనలో భాగంగా గ్రామ సర్పంచ్ కుమ్మరి సౌభాగ్య లక్ష్మి నాగప్ప కలిసి అంగడి రాయిచూరు గ్రామానికి సంబంధించిన వివిధ అభివృద్ధి పనులు సమస్యల గురించి కలెక్టర్ కు వివరించి వినతి పత్రం సమర్పించారు.

## క్షేత్రస్థాయి తనిఖీలకు ప్రాధాన్యత ఇవ్వాలి : టీపీజేఏసీ




**సికింద్రాబాద్, జూన్ 30 (జనం సాక్షి):** పరిశ్రమల్లో కేవలం కాగితాలపై తనిఖీలు కాకుండా క్షేత్రస్థాయి వాస్తవ తనిఖీలు నిర్వహించాలని, భద్రతా నిబంధనలు ఉల్లంఘించిన అధికారులపై శాఖాపరమైన చర్యలతో పాటు క్రిమినల్ బాధ్యతను కూడా నిర్ధారించాలని తెలంగాణ పీపుల్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (టీపీజేఏసీ) సంగారెడ్డి జిల్లా చైర్మన్ వై. అశోక్ కుమార్, నాయకుడు కన్నెగంటి రవి డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్, సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో సిగాచి కంపెనీ పేలుడు ఘటనకు ఏడాది పూర్తైన సందర్భంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో వారు పాల్గొని మాట్లాడారు. ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం ప్రకటించిన పూర్తి పరిహారాన్ని వెంటనే చెల్లించాలని కోరారు. సమావేశంలో పాల్గొన్న ప్రొఫెసర్ హరగోపాల్ మాట్లాడుతూ, పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలుపై ప్రభుత్వం కఠిన పర్యవేక్షణ చేపట్టాలని, ప్రమాదాలకు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. బాధిత కుటుంబాలకు ప్రకటించిన హామీలను వెంటనే అమలు చేయాలని, లేకపోతే ప్రజల విశ్వాసం దెబ్బతింటుం దని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మీరా సంఘమిత్ర, డాక్టర్ కలపాల బాబురావు, ఐవాన్, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన సిటీ పోలీస్ కమిషనర్

- రికార్డులు, కమాండ్ కంట్రోల్ రూమ్‌ల క్షుణ్ణ పరిశీలన..
- పరిసరాల పరిశుభ్రతపై ఎస్‌హెచ్‌ఓ మహేందర్ రెడ్డి బృందానికి ప్రశంసలు
- కాలేజీల్లో డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్‌లపై ఉక్కుపాదం మోపాలి
- విజిటింగ్ పోలీసింగ్‌తోనే ప్రజల్లో నమ్మకం, నేరాల నియంత్రణ



**ఇబ్రహీంపట్నం, జూన్ 30 (జనం సాక్షి):** ఫ్యూచర్ ఫీచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషి మంగళవారం నాడు ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించి, స్టేషన్ పరిసరాలను, అంతర్గత విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించారు. మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీంపట్నం ఏసీపీ రాజు లతో కలిసి కమిషనర్ తొలుత పోలీస్ స్టేషన్ ఆవరణను పర్యవేక్షించారు. ఆవరణలో ఉన్న పలు కేసులకు సంబంధించిన స్వాధీనం చేసుకున్న వాహనాల వివరాలను, సుదీర్ఘకాలంగా విడిచిపెట్టబడిన గుర్తుతెలియని వాహనాల స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది యొక్క వాహనాల పార్కింగ్ స్థలంతో పాటు పోలీస్ స్టేషన్ వెనుక భాగంలో ఉన్న సిబ్బంది క్వార్టర్స్‌ను కూడా సందర్శించి పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉన్నతాధికారులతో కలిసి కమిషనర్ మొక్కలను నాటారు. ఈ సందర్శనలో భాగంగా పోలీస్ స్టేషన్ ప్రధాన భవనంలో ఉన్న సిబ్బంది బ్యారక్, అత్యాధునిక సీసీటీవీ కమాండ్ కంట్రోల్ రూమ్, కోర్టు రికార్డు రూమ్, కేస్ ప్రాపర్టీ రూమ్ మరియు సిబ్బంది విధులు నిర్వహించే కార్యాలయ గదులను ఆయన నిశితంగా పరిశీలించారు. స్టేషన్ హౌస్ మరియు దాని పరిసర ప్రాంతాలను అత్యంత పరిశుభ్రంగా, క్రమశిక్షణతో నిర్వహించినందుకు ఇబ్రహీంపట్నం ఎస్‌హెచ్‌ఓ మహేందర్ రెడ్డి ని మరియు వారి పోలీస్ సిబ్బందిని కమిషనర్ ప్రత్యేకంగా కొనియాడారు. అనంతరం గత సంవత్సరం నుండి ఇప్పటివరకు పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలను, ఈ సంవత్సరంలో ప్రజల నుండి వచ్చిన ఫిర్యాదుల స్థితిగతులను రికార్డుల ద్వారా ఆరా తీశారు. సిబ్బంది పనితీరు, వారి విధుల నిర్వహణపై సంతృప్తి వ్యక్తం చేశారు. వచ్చే మూడు నెలల కాలంలో తాను మరొకసారి ఈ స్టేషన్‌ను సందర్శిస్తానని, అప్పటికి సిబ్బంది మరింత పట్టుదలతో, నిబద్ధతతో, సేవాభావంతో పనిచేసి మన కమిషనరేట్‌కు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇబ్రహీంపట్నం మండల పరిధిలో పలు ప్రతిష్టాత్మక ఇంజినీరింగ్ కాలేజీలు, ఇతర విద్యాసంస్థలు ఉన్న విషయాన్ని ప్రస్తావిస్తూ.. యువతను పాడుచేస్తున్న మాదకద్రవ్యాల డ్రగ్స్ మహమ్మారి నిరోధంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆన్‌లైన్ గేమింగ్, బెట్టింగ్‌ల బారిన పడి విద్యార్థులు జీవితాలు నాశనం చేసుకోకుండా, అన్ని కాలేజీల్లో పోలీసుల ఆధ్వర్యంలో విస్తృత అవగాహన సదస్సులు ఏర్పాటు చేయాలని, తద్వారా విద్యార్థులను చైతన్యవంతులను చేయాలని అధికారులను గట్టిగా ఆదేశించారు.

## భగత్ సింగ్ కాలనీ తాగునీటి సమస్యకు పరిష్కారం దిశగా అడుగు

- ఎంపీ లాడ్స్ నిధులతో బోర్‌వెల్ నిర్మాణ పనులకు శ్రీకారం
- ప్రారంభించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి



**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ భగత్ సింగ్ కాలనీలో ఎన్నాళ్లుగానో నెలకొన్న తాగునీటి సమస్య పరిష్కారం కోసం ఎంపీ లాడ్స్ నిధులతో చేపట్టిన బోర్‌వెల్ నిర్మాణ పనులను మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కాలనీ ప్రజలు మాట్లాడుతూ, తాగునీటి సమస్యను గుర్తించి బోర్‌వెల్ నిర్మాణానికి ఎంపీ లాడ్స్ నిధులు మంజూరు చేసిన మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో ఆయన అందిస్తున్న సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని, ప్రభుత్వ ప్రజాప్రతినిధుల సహకారంతో ప్రతి కాలనీలో అవసరమైన అభివృద్ధి పనులను చేపట్టేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.

సీపీఐ పార్టీ కార్యవర్గ సభ్యురాలు లక్ష్మి మాట్లాడుతూ, భగత్ సింగ్ కాలనీ ప్రజలు ఎన్నాళ్లుగానో ఎదురుచూస్తున్న తాగునీటి సమస్యకు ఈ బోర్‌వెల్ నిర్మాణం శాశ్వత పరిష్కారానికి దోహదపడుతుందని అన్నారు. ప్రజల అవసరాలపై స్పందించి నిధులు కేటాయించిన ఎంపీ ఈటెల రాజేందర్‌కు, పనులను ప్రారంభించిన మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డికి కాలనీ ప్రజల తరఫున కృతజ్ఞతలు తెలిపారు.

ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మహిళా అధ్యక్షురాలు నిర్మల, సీపీఐ భగత్ సింగ్ కాలనీ కన్వీనర్ మహేశ్వరి, సీపీఐ మహిళా అధ్యక్షురాలు జ్యోతి, సీపీఐ నాయకులు బొందయ్య, చంద్రయ్య, నరేష్, మహిపాల్, బీఆర్‌ఎస్ నాయకులు నరసింహ చారి, యాదగిరి, రామకృష్ణ, పవన్, మార్టిన్ తదితరులు పాల్గొన్నారు.



## బైక్ దొంగతనాల ముఠా ఇద్దరు అరెస్ట్

### ఐదు ద్విచక్ర వాహనాలు స్వాధీనం

**రాజేంద్రనగర్,జూన్30(జనంసాక్షి) :** విలాసవంతమైన జీవితం, చెడు వ్యసనాల కోసం వాహన దొంగతనాలకు పాల్పడిన నిందితులను అత్తాపూర్ పోలీసులు అరెస్టు చేశారు. డీసీపీ ఎస్. శ్రీనివాస్ పర్యవేక్షణలో అత్తాపూర్ పోలీసులు కేసును చేదించారు.

ఇన్స్పెక్టర్ నాగేశ్వరరావు ప్రకారంశివరాంపల్లి పిల్లర్ నెం. 295 సమీపంలో పార్క్ చేసి ఉన్న రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ బైక్‌ను దొంగిలించిన ఇద్దరు పాత నేరస్థులను పోలీసులు పట్టుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితుల కోసం గాలింపు కొనసాగుతోంది. అరెస్టయిన మహమ్మద్ షానవాజ్ అలియాస్ షాను, మహమ్మద్ మోయిజ్ మోహియుద్దీన్‌లు తమ మరో ఇద్దరు సహచరులతో కలిసి జూన్ 25 తెల్లవారుజామున శివరాంపల్లిలోని పిల్లర్ నెం.295 వద్ద రెస్టారెంట్ ముందు పార్క్ చేసిన రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్ బైక్‌ను దొంగిలించారు. విచారణలో నిందితులు బేగంబజార్ పోలీస్ స్టేషన్ పరిధిలో హోండా యాక్టివా, మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో సుజుకి బర్గ్‌మన్ స్ట్రీట్ బైక్‌తో పాటు మరో రెండు ద్విచక్ర వాహనాలను కూడా దొంగిలించినట్లు తేలింది. నిందితుల నుంచి రాయల్ ఎన్‌ఫీల్డ్ హిమాలయన్, రెండు సుజుకి బర్గ్‌మన్ స్ట్రీట్ బైక్‌లు, రెండు హోండా యాక్టివాలు కలిపి మొత్తం ఐదు ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గతంలో కూడా వీరిపై పలు ఆస్తి నేరాలతో పాటు హత్యాయత్నం కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు.

## స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమాన్ని పరిశీలించిన కొలన్ హన్మంత్ రెడ్డి



**నిజాంపేట్ జూన్ 30 (జనం సాక్షి) :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 295వ డివిజన్ బౌరంపేట్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీలో మంగళవారం నిర్వహించిన ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి బూత్ లెవెల్ అధికారులతో (బిఎల్ఓ)తో కలిసి పరిశీలించారు.. ఈ సందర్భంగా హనుమంత్ రెడ్డి మాట్లాడుతూ, ఓటరు నమోదు ప్రక్రియను బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవడంతో పాటు, ఓటరు జాబితాలో ఖచ్చితత్వం ఉండేలా అవసరమైన వివరాలను సేకరించాలని అధికారులకు సూచించారు. ప్రజలు బీఎల్ఓల ద్వారా అందించే ఎన్యుమరేషన్ ఫారమ్‌లను సక్రమంగా నింపి సమర్పించాలని, ముఖ్యంగా 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న యువత ఈ అవకాశాన్ని వినియోగించుకుని కొత్త ఓటరుగా నమోదు చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని పేర్కొన్న ఆయన, ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు,కార్యకర్తలు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## పంచముఖ హనుమాన్ ఆలయానికి రూ.25 వేల విరాళం



**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని పీర్జాదిగూడ డివిజన్ రాయంచ కాలనీలో ఉన్న శ్రీ పంచముఖ హనుమాన్ దేవాలయంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు ఆకుల మధుకర్, కిరణ్ నాయక్ తదితరులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీర్వాదాలు పొందారు. ఈ సందర్భంగా నాయకులు ఆకుల మధుకర్ ఆలయ అభివృద్ధి కోసం తనవంతు సహకారంగా రూ.25,000 నగదు విరాళాన్ని ఆలయ కమిటీకి అందజేశారు. ఆలయ అభివృద్ధికి దాతలు అందిస్తున్న సహకారం అభినందనీయమని ఆలయ కమిటీ సభ్యులు పేర్కొన్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ మేయర్ జక్క వెంకట్ రెడ్డి, మాజీ కార్పొరేటర్ కొల్తూరి మహేష్, నాయకులు ఆకుల మధుకర్‌లను శాలువాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వినోద్ కుమార్, సభ్యులు కృష్ణ, వెంకటేష్, సత్తయ్య, చందు, శ్రీనివాస్, సుమన్, అశోక్‌తో పాటు కాలనీవాసులు, భక్తులు, పలువురు నాయకులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్-2026 పనులను పరిశీలించిన డీఆర్ఓ స్వర్ణలత

- కోట్‌పల్లి మండలంలో క్షేత్రస్థాయి తనిఖీ అధికారులకు పలు సూచనలు



**కోట్‌పల్లి, జూన్ 30 (జనంసాక్షి):** జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్ఓ) స్వర్ణలత మంగళవారం కోట్‌పల్లి మండలంలో పర్యటించి ఎస్ఐఆర్-2026 కార్యక్రమం అమలును క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత అధికారులు నిర్వహిస్తున్న పనులను సమీక్షించి, కార్యక్రమాన్ని వేగవంతంగా, పారదర్శకంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఎస్ఐఆర్-2026లో భాగంగా చేపడుతున్న వివరాల సేకరణ, నమోదు ప్రక్రియ, దరఖాస్తుల పరిశీలన, రికార్డుల నిర్వహణ తదితర అంశాలను డీఆర్ఓ క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సేవలు అందించాలని, ప్రతి దరఖాస్తును నిబంధనలకు అనుగుణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం నిర్దేశించిన మార్గదర్శకాలను తప్పనిసరిగా పాటిస్తూ, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా విధులు నిర్వహించాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న పనులను త్వరితగతిన పూర్తి చేసి, నిర్దేశిత గడువులోగా కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో తహసీల్దార్ ఆనంద రావు, మండల స్థాయి అధికారులు, రెవెన్యూ సిబ్బంది, బూత్ స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

# రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలి

- పెద్దేముల్ హత్యాయత్నం కేసు..ప్రధాన నిందితురాలు శోభారాణి అరెస్ట్
- మిగతా నిందితులను కూడా అరెస్టు చేయాలి
- డిఎస్పీ నర్సింగ్ యాదయ్యకు వినతి.. ప్రజా సంఘాల నేతలు




**తాండూర్ జూన్ 30 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా తాండూరు నియోజకవర్గంలోని పెద్దేముల్ పరిధిలో రాంప్రసాద్ ముదిరాజ్ అనే వ్యక్తిపై జరిగిన కిడ్నప్ మరియు హత్యాయత్నం కేసులో ప్రధాన నిందితురాలు, కాంగ్రెస్ పార్టీ జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శోభారాణిని పోలీసులు అరెస్టు చేశారు. అయితే, ఈ దారుణానికి పాల్పడిన వారిలో మరికొందరు నిందితులు ఇంకా బయటే తిరుగుతుండటంపై ప్రజా సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. మిగిలిన నిందితులను కూడా వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ, ప్రజా సంఘాల నాయకులు తాండూరు డి.ఎస్.పి కార్యాలయంలో కలిసి వినతి పత్రాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమం లో తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు అబ్దుల్ వాహెబ్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె. శ్రీనివాస్, ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు కే. చంద్రయ్య, తెలంగాణ స్టేట్ మైనారిటీ హక్కుల పోరాట సమితి తాండూరు నియోజకవర్గ ఇంచార్జి మరియు కురువ సంఘ అధ్యక్షులు బాలయ్య, మరియు షౌకత్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాన నిందితురాలు శోభారాణి అరెస్టు జరగడం శుభపరిణామమే అయినా, ఈ కేసులో భాగస్వాములైన ఇతర నిందితులను వెంటనే అరెస్టు చేసి చట్టం ముందు నిలబెట్టాలని డిమాండ్ చేశారు. ఈ దారుణమైన కిడ్నప్ మరియు దాడికి ఉపయోగించిన మూడు వాహనాలను ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టకుండా, వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. కేసును నీరుగార్చేందుకు అధికార పార్టీ నేతలు చేస్తున్న ప్రయత్నాలను పోలీసులు అడ్డుకోవాలి. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని కోరారు. ఈ హత్యాయత్నానికి వెనుక ఉన్న అసలైన కుట్రదారులను గుర్తించి, వారిపై కఠినమైన సెక్షన్లతో కేసులు నమోదు చేయాలి. నిందితులకు రాజకీయ అండదండలు ఉన్నంత మాత్రాన చట్టం నుండి తప్పించుకోలేరని స్పష్టం చేశారు. మిగిలిన నిందితులను కూడా పోలీసులు తక్షణమే అదుపులోకి తీసుకోవాలని, లేనిపక్షంలో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో రాబోయే రోజుల్లో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. బాధితుడు రాంప్రసాద్ ముదిరాజ్‌కు పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు తమ పోరాటం కొనసాగుతుందని వారు ప్రకటించారు. ఈ వినతి పత్రం సమర్పణతో పెద్దేముల్ ఘటనపై విచారణ మరింత వేగవంతం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారు.




# కిష్టాపురం గ్రామంలో తాగునీటి సమస్యను తీర్చిన గ్రామ సర్పంచ్

**చేవెళ్ల, జూన్ 30 (జనంసాక్షి) :** గ్రామ ప్రజలకు తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన సౌకర్యాల కల్పనకు ప్రాధాన్యం ఇస్తున్నామని నాంచేరి గ్రామ సర్పంచ్ అశోక్ అన్నారు. చేవెళ్ల మండల పరిధిలోని నాంచేరి గ్రామ పంచాయతీ కిష్టాపురం గ్రామంలో మంచి నీళ్ళ సమస్య తలెత్తడంతో కొత్త బోరును వేయించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అశోక్ మాట్లాడుతూ.. గ్రామంలో తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని కొత్త బోరు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతులు కల్పించేందుకు గ్రామ పంచాయతీ నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

# ఎస్ఐఆర్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సింగిరెడ్డి పద్మారెడ్డి

- రాజ్యాంగం మనకు ఇచ్చిన అమూల్యమైన హక్కు 'ఓటు'
- బోడుప్పల్లో చురుకుగా సాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియ



**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలో ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియ చురుకుగా కొనసాగుతుంది. ఈ సందర్భంగా భీమ్ రెడ్డి నగర్ కాలనీలో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియలో మాజీ కార్పొరేటర్ సింగిరెడ్డి పద్మారెడ్డి పాల్గొని ప్రజలకు ఎస్ఐఆర్ పై అవగాహన కల్పిస్తూ, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి పద్మా రెడ్డి మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరు జాబితాలో తన పేరు నమోదు చేసుకోవాలని సూచించా రు. ఓటరు జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏవైనా మార్పులు ఉంటే వెంటనే సంబంధిత అధికారులను సంప్రదించాలని కోరారు. 18 సంవత్సరాలు నిండిన యువతి, యువకులు వెంటనే ఓటును నమోదు చేసుకోవాలని, ఎన్నికల సమయంలో మాత్రమే కాకుండా ఎప్పటికప్పుడు ఓటరు జాబితాలో తమ వివరాలను పరిశీలించుకోవడం అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఎల్ఓ రాకేష్, శివ శంకర్, వీరస్వామి, కుమార్, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గం : ఉమా మహేష్, ఏఐఎస్ఎఫ్

### మాజీ రాష్ట్ర సహాయ కార్యదర్శి




కాప్రా, జూన్ 30 (జనం సాక్షి) : విద్యార్థుల సమస్యల పరిష్కారానికి పోరాటాలే మార్గమని అఖిల భారత విద్యార్థి సమాఖ్య(ఏఐఎస్ఎఫ్) రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ ఉప్పల్ మండల మహాసభ ఈసీఐఎల్‌లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్‌లో మహేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభకు ఉమా మహేష్ ముఖ్య నేతగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మాజీ సహాయ కార్యదర్శి, సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ ప్రస్తుతం విద్యా రంగం అనేక సమస్యలు ఎదుర్కొంటున్నదన్నారు. విద్యార్థుల సమస్యలు, ప్రభుత్వ విద్య పరిరక్షణ, నిరుద్యోగం, పెరుగుతున్న విద్యా ఫీజులు భవిష్యత్తుపై విస్తృతంగా చర్చలు జరపాల్సిన బాధ్యత నేటి విద్యార్థులపై ఉందన్నారు. నేడు ప్రభుత్వ విద్యను నిర్వీర్యం చేసే విధానాలు, ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ కారణంగా సామాన్య విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి అన్వర్ మాట్లాడుతూ విద్యార్థుల సమస్యల పరిష్కారంలో ^ా×ాఖీ ఎల్లప్పుడూ ముందుంటుందని, విద్య హక్కు కోసం, ఉపాధి హక్కు కోసం, సామాజిక న్యాయం కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు. ఈ మహాసభలో నూతన ఉప్పల్ మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కమిటీ సభ్యులను సభ అభినందిస్తూ, విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఐ ఉప్పల్ మండల కార్యదర్శి టి.సత్య ప్రసాద్, ఏఐఎస్ఎఫ్ మండల నాయకులు అజీమ్ పాషా, సమీర్, ఇర్ఫాన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ దేవతల ఆలయాలు గ్రామ సంస్కృతికి ప్రతీకలు వై. రవీందర్ యాదవ్

### భక్తిశ్రద్ధల మధ్య శ్రీ గడ్డ మైసమ్మ దేవాలయం పునః ప్రతిష్ట

**ఫరూఖ్ నగర్:** ఫరూఖ్‌నగర్ మండలం దూసకల్ గ్రామంలో బాగం కృష్ణయ్య యాదవ్ ఆధ్వర్యంలో నిర్మించిన శ్రీ గడ్డ మైసమ్మ దేవాలయం పునః ప్రతిష్ట మహోత్సవం భక్తిశ్రద్ధల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ పవిత్ర కార్యక్రమానికి బీఆర్ఎస్ సీనియర్ నాయకులు వై. రవీందర్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజల్లో పాల్గొని అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామ దేవతల ఆలయాలు గ్రామ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని, ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు గ్రామాల్లో ఐక్యతను, భక్తి భావాన్ని మరింత పెంపొందిస్తాయని అన్నారు. ఆలయ నిర్మాణం, పునః ప్రతిష్ట కోసం కృషి చేసిన బాగం కృష్ణయ్య యాదవ్‌ను ప్రత్యేకంగా అభినందించి, గ్రామ ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షులు భాగం కుమార్, మాజీ ఎంపీటీసీ యాదయ్య, నాయకులు చాట్ల రమేష్, పాపయ్య యాదవ్, బాలు, కావలి అశోక్ యాదవ్, శివ కుమార్, కె. విష్ణు, కుమ్మరి రమేష్, పాల్గొన్నారు.

# నెల రోజుల్లో బోడుప్పల్-చెంగిచెర్ల, బోడుప్పల్-చిల్కానగర్ రహదారుల పనులు పూర్తి

### అధికారులతో కలిసి పనులను పరిశీలించిన మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్



బోడుప్పల్-జనంసాక్షి : బోడుప్పల్-చెంగిచెర్ల, బోడుప్పల్ అంబేద్కర్ విగ్రహం నుంచి చిల్కానగర్ వరకు చేపట్టిన ప్రధాన రహదారి అభివృద్ధి పనులు మరో నెల రోజుల్లో పూర్తయ్యేలా అధికారులు హామీ ఇచ్చారని బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలిపారు. రూ.26 కోట్ల వ్యయంతో హెచ్ఎండీఏ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ రహదారి అభివృద్ధి పనులకు ప్రధాన అడ్డంకిగా ఉన్న విద్యుత్ స్తంభాల మార్పిడి (పోల్ షిఫ్టింగ్) ప్రక్రియ పూర్తికావడంతో పనులు మరింత వేగంగా కొనసాగనున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో బోడుప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ శైలజ, హెచ్ఎండీఏ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్, హెచ్ఎండీఏ ఎలక్ట్రికల్ వింగ్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నవీన్ రావు, టీఎస్ఎస్పీడీసీఎల్ డిప్యూటీ ఇంజినీర్ బాగయ్య, అసిస్టెంట్ ఇంజినీర్ కిరణ్మయి, కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్లు, కాంగ్రెస్ నాయకులతో కలిసి మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ రహదారి పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా తోటకూర అజయ్ యాదవ్ మాట్లాడుతూ, ప్రజలు ఎన్నో రోజులుగా ఎదురుచూస్తున్న ఈ రెండు ప్రధాన రహదారులు మరో నెల రోజుల్లో పూర్తై ప్రజలకు అందుబాటులోకి రావడం సంతోషకరమని అన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలకు అనుగుణంగా, నిర్ణీత గడువులో పూర్తి చేసి త్వరగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు. ఈ తనిఖీ కార్యక్రమంలో అధికారులు, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.